# నాలుగువేళ్ళు

-గౌరిపెద్ది సుబ్బరామయ్య

ఆవేశంతో ఊగిపోతున్న నేను అప్పుడేమి చేస్తున్నానో తెలియని ఉన్మాదంలో చూపుడువేలు చూపెట్టి ''ఈ క్షణమే ఇక్కడి నుండి వెళ్లిపోతున్నాం. మీ చావు మీరు చావండి'' అన్నాను. నులకమంచం మీద దిండు ఊతగా పెట్టుకుని కూర్చున్న ముసలి తండ్రితో విసవిసా చెప్పుల కాళ్లతోనే గుమ్మం లోపలికి పోతూ.

ఎక్కడి బట్టలక్కడే ఎక్కడి గిన్నెలక్కడే పడివున్నాయ్. మొత్తంమీద ఇల్లంతా చిందరవందరగా వుంది.

''ఏమే! ఇంకా తెమలలేదా?'' అన్నాను కోపంగా భార్య సుశీలను ఉద్దేశించి.

''పదండి!'' అనింది ముక్తసరిగా సుశీల చంకలో పిల్లాడిని మరో చేత్తో సూట్‌కేస పట్టుకుని నా వెనుకాలేవస్తూ.

వంటింట్లోంచి అమ్మ కన్పిస్తోంది. నోట్లో చీరకొంగు కుక్కుకుంటూ కనుగ్రుడ్లలో నీళ్లు చిమ్ముతుంటే.

''ఏరా పెద్దోడా!'' అని ఏదో చెప్పబోయి బలవంతంగా ఆపుకుంటున్నట్లుగా ఆమె ముఖంలో తేడా ప్రస్ఫుటంగా కన్పిస్తోంది.

వరండా దాటి అడుగు బయటపెడుతున్న నన్ను నాన్న పిలిచాడు.

కనుబొమలు దగ్గరకి చేసి తీక్షణంగా చూస్తున్న నన్ను చూసి...

''వొరేయ్! నేను నీ తండ్రిగా చెప్పట్లేదు. ముసలి తండ్రిగా కాదు, ఒక బడిపంతులుగా చెబుతున్నా. ఇంత చిన్న...చిన్నవాటికి నువ్వు ఆవేశపడిపోతే చాలా కష్టం. జీవితంలో నెగ్గుకురాలేం. నువ్వు నావైపు నీ చూపుడువేలు చూపెట్టి మరీ చెప్పావ్. ఒక్క వ్రేలే నావైపు తిరిగింది. మిగిలిన నాల్గూ నీవైపే వున్నాయ్. ఇది మాత్రం గుర్తుంచుకో'' అన్నాడు దగ్గుతూ.

''నువ్వేమీ శాపనార్థాలు పెట్టక్కర్లేదు'' అరిచాను గొంతు చించుకుని గట్టిగా.

నేను చేస్తున్నది సబబే అని నా వాదన. దానికితోడు నా భార్య సుశీల నన్ను సమర్థిస్తూ వంత పలికింది. తిరుగులేని నిర్ణయం తీసుకున్నాను.

మా ఆఫీసుకు దగ్గర్లో ఇల్లు అద్దెకు తీసుకుని అందులోకి మారిపోయాం. అప్పుడప్పుడు అన్పిస్తుంది అక్కడ తల్లిదండ్రులతో కలసి వుంటే అద్దె డబ్బులు మిగిలేవని. కనీసం వేన్నీళ్లకు చన్నీళ్లకన్నా పనికొచ్చేవని. కానీ అనుకోకుండా ఆ రోజు గొడవ వచ్చింది. ఎవరు మొదలుపెట్టారో ఖచ్చితంగా తెలీదు. గొడవ మాత్రం వంటింట్లోంచి మొదలైన సంగతి మాత్రం నిక్కచ్చిగా చెప్పొచ్చు.

వంటింట్లోంచి వటుడింతై అన్నట్లు ముందు వసారాలోకి ప్రాకింది గొడవ.

పనికొచ్చేవీ పనికిరానివీ అన్నీ చర్చాంశాలైనాయి. ఆఖరికి వేరే కాపురం పెట్టాల్సి వచ్చింది.

''వొరేయ్! నేను నీ తండ్రిగా చెప్పట్లేదు. ముసలి తండ్రిగా కాదు, ఒక బడిపంతులుగా చెబుతున్నా. ఇంత చిన్న...చిన్నవాటికి నువ్వు ఆవేశపడిపోతే చాలా కష్టం. జీవితంలో నెగ్గుకురాలేం. నువ్వు నావైపు నీ చూపుడువేలు చూపెట్టి మరీ చెప్పావ్. ఒక్క వ్రేలే నావైపు తిరిగింది. మిగిలిన నాల్గూ నీవైపే వున్నాయ్. ఇది మాత్రం గుర్తుంచుకో'' అన్నాడు దగ్గుతూ.

నా మనసునెంత అదుపులో పెట్టుకున్నా మా నాన్న మనస్తత్వం నాకు అసలు సరిపోదు. చిన్నప్పట్నుంచీ అంతే. మంచి సలహాకూ అంతే మరో సలహాకూ అంతే. నిప్పులో త్రొక్కిన కోతిలా శివాలెత్తడం తప్ప మరోటి చేతకాదు. ఈ రోజూ అంతే.

కొంతకాలమక్కడ అదే ఊళ్లో పనిచేసి ప్రమోషన్ మీద హైదరాబాద్ బదిలీ అయ్యాను. కాలచక్రం గిర్రున తిరిగింది. నా కొడుకు పెద్దవాడయ్యాడు. ఉద్యోగం వచ్చింది. పెళ్లిచేస్తే ఒక్క బాధ్యతా తప్పుతుంది. అక్కడే తెల్సినవాళ్లమ్మాయినిచ్చి పెళ్లిచేసా.

నేనూ పెద్దవాడ్ని అయ్యాను.

రిటైర్ అయినరోజు కొంత ఊపిరి పీల్చుకున్నా. ఎలా కాలక్షేపం చేయాలన్న ప్రశ్న మనసులో మెదిలింది. రోజూ ఆఫీసులో పేపరు చదివేవాడ్ని. రిటైర్ అయినప్పటి నుండి ఇంటికే పేపరు తెప్పించుకుంటున్నా.

ఓరోజు... కాలక్షేపం కోసం కొబ్బరి చెట్టుకింద వాలుకుర్చీ వేసుకుని ఏవో చిన్నప్పుడు బళ్లో నేర్చుకున్న వేమన పద్యాలు సుమతీ శతకంలోనివి కొన్ని వల్లె వేసుకుంటున్నా. ఇంతలో-

''కాయలు రాలి ఏ క్షణానైనా పడొచ్చు. మీకెన్నిసార్లు చెప్పాలి. అక్కడ కూర్చోవద్దని'' ఉరుముతూ చెప్పాడు నా పుత్రరత్నం ప్రకాశం.

ఏమిటో కాసేపలా గాలికి కూర్చుంటేగానీ ఈ ముసలి ప్రాణానికి ఊరట వుండదు.

ఏమిటో నా ఇంట్లో నాకు స్వేచ్ఛలేదు. అక్కడ కూర్చోవద్దు, ఇక్కడ కూర్చోవద్దు. అది తినొద్దు, ఇది త్రాగొద్దు. ఎన్ని నిబంధనలో? ఇది నా ప్రస్తుత పరిస్థితి.

గతం గుర్తుకొచ్చింది. నేనూ చిన్నతనంలో ఇంతే సలహాలిచ్చేవాడ్ని మా నాన్నకు. ఆయన విసుక్కునేవాడు.

''ఏరా! ఇంకా పేపరబ్బాయి రాలేదా'' అన్నాను. దగ్గర్లో నిల్చుని గోళీకాయలు ఆడుకుంటున్న మనువడితో.

''ఈ రోజు బందు కదూ తాతయ్య. అందుకని పేపరబ్బాయి రాలేదు'' బదులిచ్చాడు.

''ఏమిటో ఇదొక వీక్‌నెస్. ప్రొద్దునే కాఫీ కొంచెం చప్పరిస్తూ పేపరు చదువుతుంటేగానీ తోచదు'' అని మనసులో అనుకున్నా.

సరే! ఈ రోజు టైంటేబుల్‌లోంచి పేపరు రీడింగ్ కట్ చేస్తూ ఏదో ఒకటి చేయాలనుకున్నా. ఇంతలో ఏవో శబ్దాలు విన్పిస్తున్నాయి వంటింట్లోంచి. కారణం బుర్రకు తోచి చావట్లేదు. ఒకటే గొడవ. ప్రొద్దునే గిన్నెలు విసిరేసుకుంటున్న చప్పుళ్లు. మెల్లగా లేచి వెళ్లా వంటింట్లోకి.




చిన్నసైజు కురుక్షేత్రంలా తయారైంది వంటిల్లు. కొంగు జారిపోతున్నా పట్టించుకోక ఆవేశంతో ఊగిపోతూ గట్టిగా అరుస్తోంది కోడలుపిల్ల. బెంబేలెత్తి గోడకు చేరి నిల్చుంది నా ముసలి భార్య. మధ్యమధ్య చేతులూపుతూ. ఊపిరి భారంగా తీసుకుంటోంది కోడలుపిల్ల.

సాయంత్రం కాఫీగ్లాసు చేతికందిస్తూ చెప్పింది నా భార్య సుశీల అసలు విషయం.

''అబ్బాయి వాళ్ళు వేరే కాపురం పెడతారుట. ఇక్కడ మనతో కలసి వుండడం వాళ్ళకు ఇష్టం లేదుట. సాయంత్రం వెళ్ళిపోతారట'' అంది దాదాపుగా ఏడ్చినంతగా.

కారణం అడిగా. ప్రత్యేకంగా ఏమీ లేదట. కాకపోతే నిన్న నేను చేసిన చిన్న పొరపాటుకు ఈ శిక్షట. ఇంతకూ నేను చేసిన తప్పేమిటి? అంటే! నిన్న మా ఆవిడ ఉపవాసమని వంటింట్లోకి వెళ్ళలేదు. దాంతో వంట మా కోడలు చేసింది. ఏదో మామూలుగా ''పప్పులో చింతపండు ఎక్కువైనట్టుంది'' అన్నా. అదీ సంగతి. అది కాస్తా చిలికి చిలికి గాలివానగా మారి ఇద్దరి మధ్యా గొడవ తయారైంది. పోయిపోయి అది కాస్తా వేరే కాపురం పెట్టేవరకు పోయింది.

సాయంత్రం మనవడు, కోడలు నా ఒక్కగానొక్క కొడుకు వెళ్ళిపోయారు.

మనసెందుకో వెలితిగా తోచింది.

ఎప్పుడూ... కొడుకుతో మనువడితో భోజనానికి కూర్చుండే నేను ఆ రోజు రాత్రిపూట ఒక్కడినే కూర్చున్నా. నోట్లో అన్నం ముద్ద పెట్టుకుంటే తండ్రి గుర్తొచ్చాడు. అన్నం ముద్ద పట్టుకున్న నా చేతివ్రేళ్ళు నన్ను చూసి. వెక్కిరించినట్లుగా ఫీలింగ్. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

''పప్పులో కారం ఎక్కువైందాండి?'' అడిగింది సుశీల కంట్లోంచి రాలిపడ్తోన్న కన్నీటి చుక్కల్ని చూసి కొంచెం నెయ్యి వడ్డిస్తూ!

సమాధానం ఏమి చెప్పాలో తెలియని స్థితిలో నా చేతివ్రేళ్ళను చూసుకుంటూ ఉండిపోయా.

★

